జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 12-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 781 పేజీలు: 4 వెల : రూ.7

# మూడేళ్లుగా.. మూాలకే!



* కోట్లాది రూపాయలతో నిర్మించిన మందస మోడల్ పోలీస్ స్టేషన్ * స్టేషన్‌లో అన్నిరకాల సదుపాయాలు * నిర్మాణం పూర్తయినా.. ప్రారంభానికి నోచుకోని వైనం * తుప్పలతో నిండిన పీఎస్ ఆవరణ * వాస్తుదోషమే కారణమంటూ ప్రచారం





మందస, సెప్టెంబర్ 11(వార్త): ఆధునిక సాంకేతికతతో పాటు ఆధునిక సౌకర్యాలతో మందసలో మోడల్ పోలీసు స్టేషన్‌ను మూడేళ్ల కిందట నిర్మించారు. దీనికి గాను సుమారు రెండు కోట్ల వరకూ ఖర్చయిందని సమాచారం. గతంలో నిర్మించిన పోలీసు స్టేషన్ పాతబడిపోయింది. దీంతో కొత్త స్టేషన్ నిర్మాణానికి ముందుగా మందస శ్మశానం దగ్గరలో స్థల పరిశీలన చేశారు. అదేవిధంగా శిలాఫలకం కూడా వేశారు. సాంకేతిక సమస్యలు రావడంతో ఈ నిర్మాణాలను మందస పట్టణంలో పాత పోలీసు క్వార్టర్‌కు మార్చారు. నిధులు లోటు లేకపోవడంతో పోలీసు స్టేషన్ నిర్మాణం సుందరంగా అత్యధునిక టెక్నాలజీతో భవనాలను నిర్మించారు. అయితే నిర్మాణం పూర్తయి మూడేళ్లు కావస్తున్నప్పటికీ, స్టేషన్ ప్రారంభోత్సవం జరగడంలేదు. దీంతో భవనాలు అలంకారప్రాయంగా, నిరుపయోగంగా మారాయి. ఈ స్టేషన్‌ను ఎందుకు ప్రారంభించడం లేదో అంతుచిక్కడం లేదు. వాస్తుదోషం వెంటాడుతోందని కొంతమంది చెప్పుకొంటున్నారు. మోడల్ పోలీస్ స్టేషన్ భవనాలు ప్రారంభోత్సవం కోసం గతం నుంచి వాయిదాలు పడుతూనే ఉన్నాయి. ప్రస్తుతం స్టేషన్ ఆవరణ తుప్పలతో నిండిపోయింది. మందస మోడల్ పోలీస్ స్టేషన్ భవనాలను గతంలో ఉన్నతాధికారులు సందర్శించి పరిశీలించారు. కానీ ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికైనా రాష్ట్ర పోలీస్ శాఖ ఉన్నతాధి కారులు స్పందించి, అత్యాధునిక మోడల్ పోలీస్ స్టేషన్ భవనాలు ప్రారంభోత్సవం కోసం తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే రూ.కోట్ల ప్రజాధనం నిరుపయోగంగా మారే అవకాశం ఉంది.



## అరటి గెలలో వెయ్యి ఫింగర్స్

సారవకోట, సెప్టెంబర్ 11 (వార్త): సారవకోట మండలం సవరఅడ్డ పనస గ్రామానికి చెందిన అధ్యాపకులు విశ్వ ప్రసాద్ ఇంట అరుదైన అరటి గెల ఆశ్చర్యానికి గురిచేస్తోంది. తణుకు నుంచి తెప్పించి పెంచుతున్న కేరళ రకానికి చెందిన అరటి మొక్కకు సుమారు 1000 ఫింగర్స్ కలిగిన భారీ అరటి గెల కాసింది. సాధారణంగా కనిపించే అరటి గెలలతో పోలిస్తే ఇది పెద్ద పరిమాణంలో ఉండటంతో స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విశ్వ ప్రసాద్ తన ఇంటి పరిసరాల్లో వివిధ రకాల మొక్కలను పెంచుతూ ప్రకృతిపై తనకున్న మక్కువను చాటుకుంటున్నారు. అరటి గెలను చూసేందుకు గ్రామస్థులతో పాటు చుట్టుపక్కలవారు తరలివస్తున్నారు.

## బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



* తండ్రీ కొడుకులకు గాయాలు * తండ్రి పరిస్థితి విషమం * మెరుగైన వైద్యం కోసం టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు

పలాస, సెప్టెంబర్ 11 (వార్త): ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో తండ్రీ కొడుకులు తీవ్రంగా గాయపడిన సంఘటన పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మొగిలిపాడు జంక్షన్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తండ్రి మురళి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. బంగారు మురళి, ఆయన కుమారుడు బంగారు గోపి ద్విచక్ర వాహనంపై కాశీబుగ్గ సంతకు బయలుదేరారు. గోపి ద్విచక్ర వాహనాన్ని నడుపుతుండగా, మురళి వెనుక కూర్చున్నారు. మొగిలిపాడు జంక్షన్ వద్దకు చేరుకున్న సమయంలో వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు వారి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బస్సు ఢీకొనడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రహదారిపై పడిపోవడంతో తండ్రి, కొడుకుకు గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. కొద్దిసేపటికే ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. మురళి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వైద్య వర్గాలు తెలిపాయి. గోపికి కూడా చికిత్స అందించారు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ పోలీసులు ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రుల వివరాలను నమోదు చేసుకున్నారు. కాశీబుగ్గ ఎస్సై ప్రకాష్‌రావు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

## ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ తీశారా?



* డీఎస్సీపై మాట్లాడే హక్కు జగన్‌కు ఎక్కడిది? * ఉపాధ్యాయులంటే జగన్‌కు కక్ష.. అందుకే డీఎస్సీపై దుష్ప్రచారం * డీఎస్సీపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధం * కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం, సెప్టెంబర్ 11 (వార్త): జగన్మోహనరెడ్డి సీఎంగా ఉన్న ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని, అసలు డీఎస్సీపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదని కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఉపాధ్యాయులపైనే కక్షతోనే మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి డీఎస్సీపై దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. శుక్రవారం శ్రీకాకుళంలోని భవానీ ట్రస్టు తరఫున మట్టి వినాయక విగ్రహాలను రామ్మోహన్ నాయుడు పంపిణీ చేశారు. అనంతరం మహిళా కళాశాల రోడ్డులో మీడియాతో మాట్లాడారు. కోవిడ్ సమయంలో టీచర్లను వైన్ షాపుల దగ్గర పెట్టి పని చేయించిన ఘనత జగన్మోహన్ రెడ్డిదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు మెగా డీఎస్సీ నిర్వహించి 16 వేల పోస్టులు భర్తీ చేసిందన్నారు. రెండో డీఎస్సీకి సిద్ధమవుతున్నామని, అది కూటమి ప్రభుత్వ నిబద్ధతని తెలిపారు. డీఎస్సీపై అసెంబ్లీలో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధమన్నా.. జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి వచ్చి ఎందుకు వెళ్లి చర్చించలేదని ప్రశ్నించారు. టీచర్ల స్వయంగా కర్నూలు, విశాఖపట్నంలో తమ పైన కుట్ర జరుగుతుందని కదం తొక్కిన విషయాన్ని రాష్ట్ర ప్రజలందరు చూశారన్నారు. టీచర్ల పైన కక్షపూరితంగా జగన్మోహన్ రెడ్డి ఎందుకు వ్యవహరిస్తున్నారో చెప్పాలన్నారు. డీఎస్సీ పైన చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. యువతను తప్పుదోవ పట్టించేందుకు జగన్ మోహన్ రెడ్డి లేనిపోని ప్రచారం చేస్తున్నారన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మట్టి వినాయక విగ్రహాలను పూజిద్దాం

*** భవానీ ట్రస్టు ద్వారా ప్రతి నియోజకవర్గంలో మట్టి విగ్రహాలు పంపిణీ * కులవృత్తులను ప్రోత్సహిద్దాం * కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు * విద్యార్థులకు మట్టి విగ్రహాల పంపిణీ**



**శ్రీకాకుళం, సెప్టెంబర్ 11 (వార్త):** పర్యావరణ హిత వినాయకులను అందరూ పూజించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఉమెన్స్ కళాశాలలో మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. తన చేతుల మీదుగా విద్యార్థినులకు విగ్రహాలను పంపిణీ చేశారు. వినాయక చవితిని మట్టి విగ్రహాలు, పర్యావరణానికి హాని చెయ్యని వస్తువులతో చేసుకుని నిజమైన భక్తిని చాటాలని పిలుపునిచ్చారు. కాగా భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున జిల్లా వ్యాప్తంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేపట్టారు. ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో వినాయక చవితి ముందు రోజు వరకు ఈ పంపిణీ నిరాటంకంగా సాగుతుందని తెలిపారు. ఇంకోవైపు ఈ మట్టి విగ్రహాల పంపిణీ కోసం స్థానిక కుమ్మరిలతో మాట్లాడి ప్రత్యేకంగా చేయించామన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన వోకల్ ఫర్ లోకల్ నినాదాన్ని దృష్టిలో పెట్టుకుని.. పెద్ద ఎత్తున స్థానిక కుల వృత్తుల వారికి స్థానికంగానే మరింత ఉపాధి చేరువ చెయ్యాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. భవిష్యత్ లో ఈ కార్యక్రమాలను మరింత విస్తృతపరుస్తామన్నారు. ఇంకోవైపు రాష్ట్రంలోని వినాయక మండపాలు అన్నింటికీ ఉచితంగా విద్యుత్‌ను పంపిణీ చెయ్యాలని మంత్రి లోకేష్ చేసిన ఆలోచనకు రామ్మోహన్ నాయుడు అభినందనలు తెలిపారు. రాబోయే వినాయక చవితిని పదిమంది కలిపి మరింత ఉత్సాహంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్, వంశధార ప్రాజెక్ట్ కమిటి చైర్మన్ అరవల రవీంద్ర, మున్సిపల్ అధికారులు, స్థానికులు, కళాశాల సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

## పలు హాస్టల్స్ తనిఖీ

కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శుక్రవారం శ్రీకాకుళం ఉమెన్స్ కళాశాల హాస్టల్ భవనాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. బీసీ హాస్టల్-1, 2, 3తో పాటు ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లను సందర్శించిన కేంద్ర మంత్రి.. విద్యార్థినులకు అందుతున్న వసతులు, హాస్టళ్లలో నెలకొన్న పరిస్థితులపై ఆరా తీశారు. హాస్టల్ భవనాల్లో కలియతిరుగుతూ విద్యార్థినులతో, వార్డెన్లు, సిబ్బందితో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.విద్యార్థినులకు అందుతున్న భోజనం, తాగునీరు, గదులు, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన వసతులు కల్పించడంతో పాటు, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మంత్రి సూచించారు. విద్యార్థినుల అవసరాలు, సౌకర్యాల విషయంలో సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. త్వరలోనే మళ్ళీ హాస్టల్ భవనాలను పరిశీలిస్తానని.. పురోగతి కనిపించాలని సిబ్బందిని అదేశించారు. విద్యార్థినులు చదువుల్లో మరింత రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, వంశధార ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ అరవల రవీంద్ర, హాస్టల్ సిబ్బంది, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కోతుల దాడుల నుంచి ప్రజలను రక్షించాలి

**- ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌కి జనసేన వినతి**



**మందస, సెప్టెంబరు 11(వార్త):** కుంటికోట పరిసర గ్రామాల్లో కోతుల బెడద రోజురోజుకూ తీవ్రమవడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వానరమూకలు గుంపులుగా జనావాసాల్లోకి చొరబడి ఇళ్లలోని ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడమే కాకుండా, అడ్డువచ్చిన వారిపై దాడులు చేస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నాయి. దీంతో కాశీబుగ్గ రేంజ్ అటవీఅధికారి పట్టా అమ్మినాయుడుకు జనసేన పలాస ఇన్ చార్జి డాక్టర్ దుర్గారావు, మందస జనసేన నాయకులు దున్న హరికృష్ణ, వంకల రమేష్, గుమ్మడి మణి, సునీల్ కలిసి వినతిపత్రం అందించారు. కోతుల నుంచి రక్షించాలని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తోటల్లోని పండ్ల చెట్లను, పంటలను నాశనం చేస్తుండటంతో రైతులు భారీగా నష్టపోతున్నారని, అటవీ ప్రాంతాలు రోజురోజుకు తగ్గిపోవడం వాటికి అడవిలో ఆహారం లభించకపోవడంతో గ్రామాల్లోకి, కాలనీల్లోకి చొచ్చుకు వస్తున్నాయన్నారు. ఇళ్లలో తయారు చేసుకున్న భోజనాలతో పాటు పప్పు దినుసులు పట్టుకెళ్తున్నాయన్నారు. కిరాణాషాపులు, పండ్ల దుకాణాలదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, షాపు ల్లోని వస్తువులకు రక్షణగా జాలీలను ఏర్పాటు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అటవీశాఖాధికారులు స్పందించి, కోతుల బెడద నుంచి రక్షించాలని వారు కోరారు.

## వివేకానంద విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ

**-చెకుముకి పోటీల్లో జిల్లా స్థాయికి అర్హత**



**మందస, సెప్టెంబరు 11(వార్త):** మందస పట్టణంలోని వివేకానంద విద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభ చూపారు. మండలంలోని హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు అర్హత సాధించారని నిర్వాహకులు ప్రకటించారు. ఆశిశ్ మహంతి, మూల ధనుష్, అర్పిత గౌడ్ లు ప్రథమ సాధించారు. ఈ నెల 27న జరిగే జిల్లా స్థాయి సైన్స్ సంబరాలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు బోర ఉమాపతి, డైరెక్టర్లు జె.శంకర్, పి.కోటి, బి. కామేశ్వరరావు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

## చెకుముకి విజేత నగరంపల్లి హైస్కూల్

**- జిల్లా స్థాయి పోటీలకు**

**నగరంపల్లి, పాతటెక్కలి పాఠశాలలు**



**పలాస, సెప్టెంబరు 11(వార్త):** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వజ్రపుకొత్తూరు మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి 'చెకుముకి' సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి విజేతగా నిలిచారు. పాతటెక్కలి ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని సాధించారు. దీంతో ఇరు పాఠశాలలు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించాయి. నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొని తమ విజ్ఞాన ప్రతిభను ప్రదర్శించారు. శాస్త్రీయ దృక్పథం, విషయ పరిజ్ఞానం, తార్కిక ఆలోచనా సామర్థ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పోటీ నిర్వహించారు. జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. హేమారావు ఆధ్వర్యంలో కార్యక్రమం వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులు టి.యరన్న, కొయ్యల శ్రీనివాసరావు, ఎల్. శ్రీదేవి, కృష్ణారావు, మాధవరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## హిందీ భాష గొప్పతనాన్ని చాటిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

**పలాస, సెప్టెంబరు 11(వార్త):** ఈ నెల 14న నిర్వహించనున్న హిందీ దివస్‌ను పురస్కరించుకుని పలాస రామకృష్ణపురంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో శుక్రవారం ముందస్తుగా హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 12, 13 తేదీలు సెలవు దినాలు కావడంతో పాఠశాలలో ముందుగానే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు శ్రీ సత్య సాయి విద్య విహార్ ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో హిందీ భాషపై ఆసక్తి, అభిమానం పెంపొందించేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఏడో తరగతి విద్యార్థిని మీరాబాయి వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచి అందరినీ ఆకట్టుకుంది. ఆమె ప్రదర్శన విద్యార్థులు, ఉపాధ్యాయుల ప్రశంసలు అందుకుంది. హిందీ భాష ప్రాముఖ్యత, దేశ ఐక్యతలో భాష పాత్రను వివరిస్తూ విద్యార్థులు నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. భావవ్యక్తీకరణ, నృత్య కదలికలు, సమన్వయంతో హిందీ భాష గొప్పతనాన్ని కళ్లకు కట్టినట్లు ఆవిష్కరించారు. భాషను కేవలం పాఠ్యాంశంగా కాకుండా సాంస్కృతిక వారసత్వంగా పరిచయం చేసేలా కార్యక్రమం సాగింది. విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలతో పాటు సృజనాత్మకత, వేదికపై ప్రదర్శన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పాఠశాల ఉపాధ్యాయ బృందం తెలిపింది. విద్యార్థుల ప్రదర్శనలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి విద్యావిహార్ ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, హిందీ ఉపాధ్యాయులు హేమంత్, హేమ, జయ, లలిత, కల్పన తదితరులు పాల్గొన్నారు.



## బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతం




**పలాస, సెప్టెంబరు 11(వార్త):** దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు చేపట్టిన ఒకరోజు సమ్మె పలాసలో విజయవంతమైంది. బ్యాంకింగ్ రంగంలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్‌బీఐ పలాస శాఖ వద్ద నుంచి కాశీబుగ్గ శ్రీనివాస జంక్షన్ వరకు ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. దశాబ్దంగా అదే డిమాండ్ చేస్తున్న బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజుల పనిదినాలను అమలు చేయాలని దశాబ్దకాలంగా డిమాండ్ చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం, బ్యాంకింగ్ యాజమాన్యాలు తగిన నిర్ణయం తీసుకోలేదని ఉద్యోగ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రోజుల పనిదినాల అమలుపై ఒప్పందం జరిగినప్పటికీ దానిని అమలు చేయకపోవడం ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని తెలిపారు. పనిభారం పెరుగుతోందని, బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ లావాదేవీలు, ప్రభుత్వ పథకాల అమలు విస్తరిస్తున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా సిబ్బంది నియామకాలు చేపట్టడం లేదని నాయకులు ఆరోపించారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా ఉన్న ఉద్యోగులపైనే అదనపు పనిభారం మోపుతున్నారని అన్నారు. దీంతో ఉద్యోగులపై ఒత్తిడి పెరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీన ప్రక్రియ కొనసాగిస్తూ, ప్రైవేటు రంగ బ్యాంకులను ప్రోత్సహించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోందని నాయకులు విమర్శించారు. ప్రజలకు విస్తృతంగా బ్యాంకింగ్ సేవలు అందిస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకులను బలోపేతం చేయడంతో పాటు, అవసరమైన స్థాయిలో సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం, బ్యాంకు యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తే అక్టోబర్‌లో నిరవధిక సమ్మెకు వెళ్లక తప్పదని ఉద్యోగ సంఘాల నాయకులు హెచ్చరించారు. ప్రస్తుత సమ్మెను సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే కార్యక్రమంగా అభివర్ణించారు.

ఈ సందర్భంగా బ్యాంకు ఉద్యోగుల సంఘ నాయకులు పి. గోపీకృష్ణ, ఎన్. శ్రీనివాస్‌రమణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్. గణపతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు యూనియన్ నాయకులు టి. జగదీష్, డోల వెంకటేశ్వరరావు (ఎస్‌బీఐ), జి. రవీంద్ర (సెంట్రల్ బ్యాంక్), బసవేశ్వరరావు (ఇండియన్ బ్యాంక్), సీఐటీయూ నాయకుడు టి. సింహాద్రితో పాటు వివిధ బ్యాంకుల ఉద్యోగులు పాల్గొన్నారు.

## శ్రీముఖలింగం భూ సమస్య పరిష్కారానికి చర్యలు



**జలుమూరు, సెప్టెంబరు 11 (వార్త):** శ్రీముఖలింగం గ్రామానికి చెందిన 80 మంది రైతుల జిరాయితీ భూములు 22ఏ(1)(సి) నిషేధిత జాబితాలో చేరడంతో ఎదురవుతున్న సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. నిషేధిత జాబితాలో భూములు చేరడంతో వాటి రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం లేకపోవడంతో భూ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యపై శ్రీముఖలింగం సర్పంచ్ అభ్యర్థి మొజ్జాడ రామారావు మరియు మాజీ వైస్ సర్పంచ్ గుంట కరణవీరుడు నేతృత్వంలో భూ యజమానుల బృందం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కలిసి వినతిపత్రం సమర్పించింది. తమ జిరాయితీ భూములను దేవాదాయ శాఖ పరిధిలోని జాబితా నుంచి తొలగించి, రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. రైతుల సమస్యను పరిశీలించిన కేంద్ర మంత్రి శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూషతో మాట్లాడి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో శ్రీముఖలింగం దేవాదాయ భూములు, రైతుల జిరాయితీ భూములకు సంబంధించిన పత్రాలను సమగ్రంగా పరిశీలించనున్నారు. రైతుల వద్ద ఉన్న భూ యాజమాన్య పత్రాలతో పాటు దేవాదాయ శాఖ వద్ద ఉన్న రికార్డులు, రెవెన్యూ శాఖ రికార్డులను పరిశీలించి వాస్తవ పరిస్థితిని నిర్ధారించనున్నారు. సంబంధిత శాఖల అధికారులు, రైతులను ఒకచోట కూర్చోబెట్టి సమస్యకు పరిష్కారం చూపాలని కేంద్ర మంత్రి సూచించినట్లు పేర్కొన్నారు. ఆర్డీవో సాయి ప్రత్యూష స్పందిస్తూ శ్రీముఖలింగం గ్రామంలోనే సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యను పరిశీలిస్తామని రైతులకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ నెల 16వ తేదీ లేదా 18వ తేదీ శ్రీముఖలింగం దేవాదాయ శాఖ అతిథి గృహం వద్ద శాఖాపరమైన విచారణ, సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి నిషేధిత జాబితాలో భూములు చేరిన 80 మంది భూ యజమానులు తమ భూములకు సంబంధించిన పూర్తి వివరలు, అందుబాటులో ఉన్న పత్రాలతో తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. దేవాదాయ, రెవెన్యూ శాఖల రికార్డులను పరిశీలించిన అనంతరం అర్హత ఉన్న జిరాయితీ భూముల విషయంలో తగిన చర్యలు తీసుకుని రైతుల సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు కొప్పల శ్రీను, శ్రీముఖలింగం మాజీ ఉపసర్పంచ్ గుంట కర్ణవీరుడు తదితరులు పాల్గొని రైతుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధం

**పలాస, సెప్టెంబరు 11(వార్త):** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల రెండో సాధారణ ఎన్నికలకు సంబంధించి ఫోటో ఓటర్ల జాబితాను శుక్రవారం పలాస ఎంపీడీవో వసంత్ కుమార్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం, విజయవాడ జారీ చేసిన నోటిఫికేషన్ నెం. 515/ ఎస్ఇసి -బి1/2026, తేదీ 07.09.2026 ప్రకారం ఈ ప్రక్రియ చేపట్టారు.దఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్న ఓటర్ల వివరాలతో కూడిన ఫోటో ఓటర్ల జాబితాలను సంబంధిత మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, గ్రామ సచివాలయాల్లో సెప్టెంబరు 11న ప్రచురించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా చూస్తూ జాబితాలను ప్రదర్శించడంతో ఎన్నికల ప్రక్రియలో మరో కీలక దశ ప్రారంభించారు. ఓటర్లకు కీలక అవకాశంగా ఫోటో ఓటర్ల జాబితా ప్రచురణతో తమ పేరు, కుటుంబ సభ్యుల పేర్లు, ఓటరు వివరాలు జాబితాలో ఉన్నాయా? లేదా? అనే విషయాన్ని ప్రజలు పరిశీలించుకోవచ్చునని వెల్లడించారు. ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలనుకునే ప్రతి ఓటరు జాబితాలో తన పేరు సరిగ్గా నమోదై ఉందో లేదో ముందుగానే నిర్ధారించుకోవడం కీలకమని ఎంపీడీవో తెలిపారు. పేరు లేకపోవడం, వివరాల్లో తప్పులు ఉండటం, ఫోటో లేదా ఇతర నమోదిత సమాచారంలో లోపాలు కనిపిస్తే ఎన్నికల సంఘం నిర్దేశించిన విధానంలో సంబంధిత అధికారులను సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఎంపీడీవో చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్ల జాబితా అత్యంత కీలకమని, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి ఫోటో ఓటర్ల జాబితా ప్రచురణతో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రాథమిక ప్రక్రియను ప్రారంభించామని అన్నారు. గ్రామస్థాయిలో ఓటర్ల వివరాలను పారదర్శకంగా అందుబాటులో ఉంచడం ద్వారా ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు స్పష్టత కలగనుందని తెలిపారు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రదర్శనకు ప్రాధాన్యం ఏర్పడిందని, ఎన్నికల సమయంలో ఓటు హక్కు వినియోగించుకునే ప్రతి పౌరుడు ముందుగానే తన వివరాలను పరిశీలించుకోవడం ద్వారా పోలింగ్ రోజున ఎదురయ్యే ఇబ్బందులను నివారించవచ్చునని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ మేరకు తదుపరి ఎన్నికల ప్రక్రియకు అధికారులు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో, ఓటర్ల జాబితా ప్రచురణను స్థానిక సంస్థల ఎన్నికల దిశగా కీలక అడుగుగా భావిస్తున్నారు.

## మందసను కరువు మండలంగా ప్రకటించాలి



**మందస, సెప్టెంబరు 11(వార్త):** మందస మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం మందస గ్రామ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించి, వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి పి దేవేంద్ర , మండల అధ్యక్షుడు మట్ట ధర్మరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఇప్పటి వరకు వర్షాలు లేక రైతులు పంటలు వేసుకోలేకపోయారన్నారు. ఇప్పటికే వేసిన వెదలు నీరు లేక పూర్తిగా ఎండిపోయావని అన్నారు. రైతులు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయారని, ఈ గ్రామంలో కూలీలకు ఉపాధి హామీ పనులు ఇవ్వడంలేదన్నారు. పనులు లేక వలసలు పోతున్నారని వారన్నారు. రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు ఎక్కువగా ఉండడం వలన బోరు బావులపై వ్యవసాయం చేసే రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఈ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి, రైతుల బ్యాంకు రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి వలసలు నివారించాలని, స్వల్పకాలిక విత్తనాలు ఉచితంగా రైతులకు అందించాలని, సాగునీటి కాలువలు మరమ్మత్తులు చేసి చివర భూములకు నీరు ఇవ్వాలని, అప్రకటిత విద్యుత్ కోతలు నివారించాలని, కౌలు రైతులకు, దేవాలయ భూసాగుదారులకు సాగు గుర్తింపు కార్డులు ఇచ్చి పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ తదితర ప్రభుత్వ పథకాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిందిరి వల్లభ, కోరాడ రమేష్, అల్లాడ కృష్ణ, బదకల రామయ్య, కొల్లి తాతయ్య, కొల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## చెకుముకి పోటీల్లో సొండిపూడి విద్యార్థులకు ప్రథమస్థానం



**మందస, సెప్టెంబరు 11(వార్త):** మందస మండలంలోని సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చెకుముకి పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ లో సొండిపూడి విద్యార్థులు జె.నిహారిక, ఎల్.కౌశిక్, కె.త్రివేణి టీం 40మార్కులకు గాను 30 మార్కులు సాధించి, ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జిల్లా స్థాయికి ఎంపిక కాబడ్డారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నగిరి కరుణాకర్, స్టాఫ్, గ్రామస్తులతో పాటు సహకరించిన సైన్స్ ఉపాధ్యాయులు పి.చంద్రశేఖర్, ఎస్.నారాయణ రావులను అభినందించారు.

## గణనాథుని విశిష్టతను చాటిన నృత్య రూపకం

**- శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో**

**వైభవంగా ముందస్తు వినాయకచవితి వేడుకలు**

**పలాస, సెప్టెంబరు 11 (వార్త):** వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పలాస రామకృష్ణపురంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో శుక్రవారం ముందస్తు వినాయకచవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ ఆధ్యాత్మికత, సాంస్కృతిక వైభవం ఉట్టిపడేలా విద్యార్థులు నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి విశిష్టత, ప్రాధాన్యాన్ని విద్యార్థులు నృత్య రూపకంగా అద్భుతంగా ప్రదర్శించారు. గణపతి ఆరాధన, ఆయన గొప్పతనాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. చక్కటి హావభావాలు, సమన్వయంతో సాగిన ప్రదర్శనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి మన్ననలు లభించాయి. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలపై అవగాహన పెంపొందించడంతోపాటు వారి సృజనాత్మక ప్రతిభకు వేదిక కల్పించడమే ఇటువంటి కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని శ్రీ సత్య సాయి విద్యా విహార్ ట్రస్ట్ చైర్మన్ మల్లారామేశం తెలిపారు. పండుగల వెనుక ఉన్న సాంస్కృతిక, నైతిక సందేశాలను విద్యార్థులకు పరిచయం చేయడం ద్వారా సంప్రదాయాలను భావితరాలకు చేరవేసే ప్రయత్నం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని గణనాథునిపై తమ భక్తిని, కళా ప్రతిభను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి విద్యావిహార్ ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, వైస్ ప్రిన్సిపాల్ మురళి, ఉపాధ్యాయులు అనుదీప్, దాలేసు, సునీత తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక



# ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే శిరీష దృష్టి

### -గ్రీవెన్స్‌లో వెల్లువెత్తిన వినతులు

### -రోడ్లు, డ్రైన్లు, పింఛన్లపై ప్రధానంగా ఫిర్యాదులు



**పలాస, సెప్టెంబరు 11(వార్త):** ప్రజా సమస్యల పరిష్కారానికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు నిర్వహిస్తున్న గ్రీవెన్స్ కార్యక్రమానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో వినతులు వచ్చాయి. పలాసలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రహదారులు... కాలువలు.. పింఛన్లే ప్రధానంగా..

గ్రామాలు, పట్టణ వార్డులకు సంబంధించిన మౌలిక వసతుల సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. ముఖ్యంగా రహదారుల అధ్వాన పరిస్థితి, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, మురుగునీరు నిలిచిపోవడం వంటి సమస్యలను పలువురు ప్రస్తావించారు. అర్హత ఉన్నప్పటికీ పింఛన్లు అందడం లేదని కొందరు విన్నవించగా.. తమ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని మరికొందరు కోరారు.

వినతులపై అక్కడికక్కడే స్పందిస్తూ ప్రజలు అందించిన ప్రతి వినతిని ఎమ్మెల్యే గౌతు శిరీష పరిశీలించారు. సమస్యల తీవ్రత, పరిష్కారానికి అవసరమైన చర్యలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే పరిష్కరించగల అంశాలపై అధికారులతో ఫోన్‌లోనే మాట్లాడి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలకు లోబడి పరిష్కరించాల్సిన సమస్యలను పరిశీలించి పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన చర్యలు చేపట్టాలని సూచించారు.

సంక్షేమ పథకాలు అర్హులకు అందాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రయోజనం అందేలా అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రీవెన్స్ కార్యక్రమం ద్వారా నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల సమస్యలకు ప్రాధాన్యమివ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం మాత్రమే కాకుండా వాటి పరిష్కారం వరకు నిరంతర పర్యవేక్షణ ఉండాల్సిన అవసరం ఉందని గౌతు శిరీష స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే స్థానిక సమస్యలను మరింత వేగంగా పరిష్కరించే అవకాశం ఉంటుందని అన్నారు. సమస్యను నేరుగా విని సంబంధిత అధికారులతో మాట్లాడుతున్న తీరుపై గ్రీవెన్స్‌కు వచ్చిన పలువురు ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.

## చెకుముఖి టాలెంట్ టెస్ట్‌లో మౌనిక ప్రతిభ

### - మండల స్థాయిలో ద్వితీయ స్థానం.. అభినందనలు



**పలాస, సెప్టెంబరు 11(వార్త):** శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు విద్యార్థుల్లో విజ్ఞానంపై ఆసక్తిని ప్రోత్సహించే లక్ష్యంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముఖి టాలెంట్ టెస్ట్‌లో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని గొనప మౌనిక ప్రతిభ చాటింది. కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఈ పోటీలో పదో తరగతి చదువుతున్న మౌనిక ద్వితీయ స్థానం సాధించింది. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, తార్కిక విశ్లేషణ, సమస్యలను పరిష్కరించే సామర్థ్యాన్ని వెలికితీసేందుకు ఇటువంటి ప్రతిభా పరీక్షలు దోహదపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ నేపథ్యంలో మండల స్థాయి పోటీలో మౌనిక సాధించిన విజయం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. నిరంతర సాధన, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో విద్యార్థులు విద్యతో పాటు విజ్ఞాన, సృజనాత్మక రంగాల్లోనూ రాణించవచ్చని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో పాల్గొని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. మౌనికను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రవికుమార్, సైన్స్ ఉపాధ్యాయులు పి.కృష్ణారావు, ఎం.స్వప్న, బి.సుధాకర్, ఎన్.దివాకర్, ఐ.రేవతి, వై.శ్రీనివాసరావు, సిహెచ్.కల్పన, కె.శ్యామ్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.తారక్ అభినందించారు.

## చిన్నలోహరిబందలో మహిళ అదృశ్యం



**మందస, సెప్టెంబరు 11(వార్త):** మందస మండలంలోని లోహరిబంద పంచాయతీలోని చిన్నలోహరిబంద గ్రామానికి చెందిన తాళ్ల వీరమ్మ కనిపించడం లేదని ఫిర్యాదు అందినట్టు మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ చెప్పారు. ఎరుపు రంగు చీర, జాకెట్టు ధరించిన వీరమ్మ ఈనెల 9న అంబుగాం గ్రామానికి సంతకు వెళ్లిన వీరమ్మ కనిపించడంలేదన్నారు. చిన్నలోహరిబంద ప్రాంతంలో మిస్సింగ్ అయ్యిందన్నారు. గత 10సంవత్సరాలుగా ఆమె ఫిట్స్ వ్యాధితో బాధ పడుతుండగా.. విశాఖపట్నంలో చికిత్స పొందుతున్నట్టు ఆమె కుమారుడు మాధవరావు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కృష్ణప్రసాద్ చెప్పారు.

## చల్లవానిపేట జంక్షన్‌లో నేటి నుంచి మట్టి వినాయక విగ్రహాల ఉచిత పంపిణీ

**జలుమూరు, సెప్టెంబరు 11(వార్త):** వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే ఉద్దేశంతో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చల్లవానిపేట జంక్షన్‌లోని చందన్ జ్యువెలర్స్ వద్ద సెప్టెంబర్ 12వ తేదీ శనివారం ఉదయం నుంచి మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు వెల్లడించారు. పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా సహజమైన మట్టితో రూపొందించిన వినాయక విగ్రహాలను పూజించేందుకు ప్రజలను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు పేర్కొన్నారు. మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. సెప్టెంబర్ 12వ తేదీ ఉదయం నుంచి విగ్రహాలను ఉచితంగా అందజేయనున్నందున భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమానికి సంబంధించిన మరిన్ని వివరాల కోసం 9603299344లో సంప్రదించవచ్చని తెలిపారు.

## ఎంఈవోలకు సన్మానం



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 11 (వార్త):** ఇరువురు మండల విద్యాశాఖ అధికారులను స్వర్ణ భారతి యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఎంఈఓ కాకర సూర్యారావు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఎంఈఓ 2 విశ్వనాథ్ ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఇరువురిని స్థానిక ఎంఆర్సి కార్యాలయంలో స్వర్ణ భారతి విద్యాసంస్థల చైర్మన్ తులసీదాస్ రెడ్డి ఘనంగా సన్మానించారు. వారికి శుభాకాంక్షలు తెలియజేసి వారికి ప్రత్యేక అవార్డులు రావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. వృత్తిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కే శ్రీనివాస్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ జయప్రకాష్, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ సందీప్, బర్ల లీలా లక్ష్మి, పటాన జ్యోతి, పటాన ధర్మరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటర్ల జాబితాలు విడుదల

**శ్రీకాకుళం, సెప్టెంబర్11 (వార్త):** జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం ఓటర్ల జాబితాలను శుక్రవారం ప్రచురించినట్లు జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్. వెంకటరామన్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని 538 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో, అలాగే 30 జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన ఓటర్ల జాబితాలను జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 16,09,818 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో 7,99,219 మంది పురుషులు, 8,10,544 మంది మహిళలు, 55 మంది ఇతరులు ఉన్నారని వెల్లడించారు. కాగా, జిల్లా, మండల పరిషత్తు పాలకవర్గాలతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం మరికొన్ని రోజుల్లో ముగియనుంది. ఇప్పటికే పంచాయతీలు, పురపాలక సంఘాల్లో పాలకవర్గాల గడువు పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. పంచాయతీల్లో ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసింది. వాటి ప్రకారమే జిల్లా పరిషత్తు అధికారులు సైతం ఎన్నికలకు అవసరమైన కార్యాచరణ రూపొందిస్తున్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత జరగనున్న తొలి ఎన్నికలివి. కొత్త జిల్లాలోనూ జడ్పీలు ఏర్పాటు చేసి, వాటి ఆధారంగానే ఎన్నికలు నిర్వహించనున్నారు.

## మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు

**సంతబొమ్మాళి, సెప్టెంబర్11(వార్త):** బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన నేపథ్యంలో వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని సమయంలో మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దన్నారు. ఇప్పటికే సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తిరిగి రావాలని సూచించారు. వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలు, సూచనలను మత్స్యకారులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. తీర ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను సూచించారు.

## రామకృష్ణాపురం పాఠశాలలో హిందీ దినోత్సవం



**జలుమూరు, సెప్టెంబరు 11(వార్త):** రామకృష్ణాపురం ప్రభుత్వ పాఠశాలలో హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. ఈశ్వరరావు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హిందీ భాష ప్రాధాన్యత, విద్యార్థులు భాషపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రతి ఏడాది సెప్టెంబరు 14న హిందీ దినోత్సవాన్ని నిర్వహిస్తారని, అయితే ఈసారి ఆ రోజు పబ్లిక్ హాలిడే కావడంతో వేడుకలను ముందుగానే నిర్వహించినట్లు హెచ్ఎం తెలిపారు. విద్యార్థుల్లో హిందీ భాషపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు దాని ప్రాముఖ్యతను తెలియజేసేలా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. హిందీ ఉపాధ్యాయురాలు ఎన్. శశిరేఖ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు హిందీ భాషను కేవలం ఒక పాఠ్యాంశంగా కాకుండా, దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలను అనుసంధానించే ముఖ్యమైన భాషగా గుర్తించాలని సూచించారు. కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో హిందీపై మరింత ఆసక్తి, అవగాహన కలిగేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

## పోలాకిలో కుష్టు వ్యాధిపై అవగాహన




**పోలాకి, సెప్టెంబరు 11(వార్త):** పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలో నిర్వహించిన లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్‌లో కుష్టు వ్యాధితో బాధపడుతున్న ముగ్గురిని గుర్తించినట్లు వైద్యాధికారి శ్రీనాథ్, పారామెడికల్ అధికారి వాన సురేశ్‌కుమార్ తెలిపారు. కుష్టు వ్యాధి లక్షణాలను తొలిదశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా వ్యాధిని నియంత్రించవచ్చని వారు పేర్కొన్నారు. ఇందులో భాగంగా మండలంలోని అంపలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు కుష్టు వ్యాధి లక్షణాలు, ముందస్తు గుర్తింపు, చికిత్సపై అవగాహన కల్పించారు. శరీరంపై నొప్పి లేకుండా కనిపించే మచ్చలు, ఆ ప్రాంతంలో స్పర్శజ్ఞానం తగ్గడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదని వైద్య సిబ్బంది సూచించారు. ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. కుష్టు వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడంతో పాటు వ్యాధి నిర్ధారణకు భయపడకుండా ముందుకు రావాల్సిన అవసరం ఉందని వైద్యాధికారులు తెలిపారు. ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు.

## బాలికలు విద్యలో రాణించి స్వావలంబన సాధించాలి



**పోలాకి, సెప్టెంబరు 11 (వార్త):** బాలికలు విద్యా రంగంలో ముందంజలో ఉండి ఉన్నత స్థాయికి ఎదగాలని టెక్కలి డివిజన్-4కు చెందిన శక్తి టీం పోలీసు అధికారులు సూచించారు. గంగివలసలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో శుక్రవారం శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు బాలికల భద్రతకు సంబంధించిన అంశాలతో పాటు శక్తి యాప్ వినియోగం, మహిళలు, బాలికలకు అందుబాటులో ఉన్న రక్షణ వ్యవస్థలపై వివరించారు. ఆపద సమయంలో భయపడకుండా అందుబాటులో ఉన్న సహాయ మార్గాలను వినియోగించుకోవాలని సూచించారు. విద్యే బాలికల భవిష్యత్తుకు ప్రధాన బలమని, చదువులో ప్రతిభ కనబరిచి ఉన్నత విద్యను అభ్యసించాలని అధికారులు తెలిపారు. విద్యను పూర్తిచేసి మంచి ఉద్యోగాలు సాధించడం ద్వారా ఆర్థికంగా స్వతంత్రంగా ఎదిగి, ఎవరి మీద ఆధారపడకుండా సొంత కాళ్లపై నిలబడాలని సూచించారు. అదేవిధంగా బాలికలు, మహిళలకు రక్షణ కల్పించే వివిధ చట్టాలు, వారి హక్కుల గురించి అవగాహన కల్పించారు. సమస్యలు ఎదురైనప్పుడు వాటిని దాచిపెట్టకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌సీ ఎం. గిరిధర్, శక్తి టీం పోలీసు సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## అధిక ఉష్ణోగ్రతల వల్లే కరెంట్ కోతలు

### ఏడీఈ సుధాకర్



**సోంపేట,సెప్టెంబర్11 (వార్త):** ఇటీవల కాలంలో అధిక ఉష్ణోగ్రతల వల్ల రాత్రి వేళల్లో కరెంటు కోతలు తప్పడం లేదని సోంపేట సబ్ డివిజన్ విద్యుత్ శాఖ ఏడిఈ జి.సుధాకర్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం జాతీయ వార్తతో మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వలన రాత్రివేళ కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని పేర్కొన్నారు. దీనివలన విద్యుత్ వినియోగం బాగా పెరిగి ఓవర్ లోడ్ సమస్యకు కారణం అవుతుందన్నారు. ఇటువంటి పరిస్థితులు తలెత్తినప్పుడు గ్రిడ్ సమతుల్యతను కాపాడేందుకు 132 కెవి సబ్ స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరాను ఆయా ప్రాంతాల్లో కొంత సమయం నిలుపుదల చేసి పరిస్థితిని చక్కదిద్దడం జరుగుతుందని అన్నారు. విద్యుత్ సరఫరా నిలుపుదల చేయని యెడల గ్రిడ్ తీవ్ర సమస్యలు ఎదుర్కొంటుందని, ఇది చాలా సమస్యాత్మకమైనదన్నారు. ఇటువంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు పైనుంచి వచ్చే ఆదేశాల మేరకు సబ్ స్టేషన్లలో కొంత సమయం విద్యుత్ సరఫరా నిలిపివేయడం తప్పదని ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.

## 8 కిలోల గంజాయితో ఒకరి అరెస్టు



**నరసన్నపేట, సెప్టెంబరు 11(వార్త):** మడపాం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ ఎం. శ్రీనివాసరావు, ఎస్సై బి. గణేశ్ తెలిపారు. శుక్రవారం నరసన్నపేట సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. గురువారం సాయంత్రం టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ బస్సులో ప్రయాణిస్తున్న బెంగళూరుకు చెందిన రియాజ్ పాషా అనుమానాస్పదంగా కనిపించడంతో అతడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేసినట్లు తెలిపారు. విచారణలో ఒడిశా నుంచి 8 కిలోల గంజాయిని కొనుగోలు చేసి బెంగళూరుకు తరలిస్తున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. అతడి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా గంజాయి అక్రమ రవాణా, వినియోగానికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ, ఎస్సై హెచ్చరించారు. ముఖ్యంగా పునరావృతంగా గంజాయి కేసుల్లో పట్టుబడుతున్న వారిపై చట్టపరంగా మరింత కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. సారవకోట మండలానికి చెందిన సాకిపల్లి పవన్‌కుమార్ ఇదే తరహా కేసుల్లో నరసన్నపేట, ఆమదాలవలస, ఎచ్చెర్ల, పాతపట్నం ప్రాంతాల్లో నాలుగుసార్లు నిందితుడిగా పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. కొత్త చట్టం ప్రకారం నాలుగుసార్లు గంజాయి కేసులో పట్టుబడిన నిందితుడిని సెంట్రల్ జైలుకు తరలించినట్లు వివరించారు. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం తనిఖీలు కొనసాగిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

## రాజారావు ఆశయాలే ప్రజా కళలకు స్ఫూర్తి




**పలాస, సెప్టెంబరు 11(వార్త):** ప్రజల జీవితాల్లోని కష్టాలు, కన్నీళ్లు, సమస్యలను కళారూపాల ద్వారా సమాజం ముందుకు తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం కలిగించడమే ప్రజా కళల అసలు లక్ష్యమని ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి టి. వైకుంఠరావు అన్నారు. గరికిపాటి రాజారావు ఆశయాలను కొనసాగిస్తూ ప్రజా కళలను మరింత విస్తరించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని తెలిపారు. గరికిపాటి రాజారావు 63వ వర్ధంతి సభ శుక్రవారం పలాసలోని సీఐటీయూ కార్యాలయంలో ప్రజా నాట్యమండలి జిల్లా కన్వీనర్ ఎన్. చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వైకుంఠరావు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పరిణామాలను కళాకారులు ప్రజలకు అర్థమయ్యేలా కళారూపాలుగా మలచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల బాధలు, జీవన పోరాటాలు, సామాజిక సమస్యలను నాటకాలు, పాటలు, ఇతర కళారూపాల ద్వారా ప్రతిబింబించినప్పుడే కళకు సార్థకత చేకూరుతుందని చెప్పారు. ప్రస్తుతం సమాజంలో వేగంగా విస్తరిస్తున్న విషసంస్కృతి ప్రభావాన్ని తగ్గించడంలో ప్రజా కళలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. వినోదానికే పరిమితం కాకుండా ప్రజల్లో ఆలోచనను రేకెత్తించేలా, సామాజిక బాధ్యతను పెంపొందించేలా కళా కార్యక్రమాలు సాగాలని సూచించారు. కనుమరుగవుతున్న కళలకు చేయూత అవసరం ఉందని, కాలానుగుణ మార్పుల నేపథ్యంలో అనేక సంప్రదాయ, ప్రజా కళారూపాలు క్రమంగా కనుమరుగవుతున్నాయని వైకుంఠరావు ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని కాపాడుకోవడం కళాకారులు, ప్రజా సంఘాలు, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. యువతను ప్రజా కళల వైపు ఆకర్షించేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. గరికిపాటి రాజారావు ఆశయాలను కేవలం స్మరించుకోవడానికే పరిమితం కాకుండా వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాకారులు టి. రమణమ్మ, జి. కృష్ణవేణి, జోగి ఋషి, ఎన్. ఢిల్లేశ్వరి, జె. భాగ్యలక్ష్మి, కె. సుహాసిని, డి. కామేసు, ఎన్. గణపతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాకుళంను కరువు జిల్లాగా ప్రకటించాలి

**శ్రీకాకుళం, సెప్టెంబరు 11 (వార్త):** జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని శ్రీకాకుళం జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చాపర వెంకటరమణ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వర్షాలు కురవకపోవడంతో జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. వర్షాలు లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొందని, సాగు చేసిన పంటలు కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావ ప్రభావం కేవలం వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపుతోందని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో కూలీలకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల కొనుగోలు శక్తి తగ్గి జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. రైతులు, కౌలు రైతులు ఇప్పటికే పెట్టుబడుల కోసం అప్పులు చేసి సాగు చేపట్టారని, పంటలు సరిగా పండకపోతే అప్పుల భారం మరింత పెరిగే ప్రమాదం ఉందని వెంకటరమణ తెలిపారు. వ్యవసాయ కార్మికులకు పనులు లేకపోవడంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారి, పలువురు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి, తక్షణమే కరువు పరిస్థితులను గుర్తించి శ్రీకాకుళం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఆయన కోరారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు తక్షణ ఆర్థిక, ఉపాధి సహాయం అందించడంతో పాటు అవసరమైన కరువు సహాయక చర్యలను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్, బొత్స సంతోష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ రవి, ఏఐవైఎఫ్ నాయకులు ఆర్.అరవింద్, రైతు సంఘం నాయకులు పి.వెంకటరావు, రమేష్, సీపీఐ నాయకులు పి.కృష్ణ, బి.సిమ్మయ్య, నేలవేణి పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మందస జడ్పీటీసీ రేసులో గోపాలరావు

## -జనసేన పార్టీ అభివృద్ధిలో కీలక పాత్ర
## -కూటమి విజయాల్లో తనదైన ముద్ర
## - అభ్యర్థిత్వం పరిశీలిస్తున్న కూటమి నాయకులు

నిడరంబత కలిగి వ్యక్తిగా కృషి, పట్టుదలకు కుప్పాయి గొప్ప నిదర్శనం

**మందస, సెప్టెంబరు 11(వార్త):** నాయకుడంటే కార్యకర్తలు, అభిమానుల మనసు దోచేయాలి.. పదవులకు వచ్చేసరికి ఆయనకే పదవి ఇవ్వాలి.. మంచి మనసున్న నాయకుడన్న గుర్తింపు ఉండాలి.. అందరినీ కలుపుకొని పోవాలి.. అటువంటి నాయకుడిని పార్టీ మంచి గుర్తింపు ఇస్తుంది. జనసేన పార్టీకి సరిగ్గా ఇదే వర్తిస్తుంది. ఆ నాయకుడు కుప్పాయి గోపాలరావు అని, పార్టీ అంటే ఆయనకు ప్రాణం అని, అర్ధరాత్రి అయినా.. కార్యకర్త కష్టం వచ్చిందంటే ముందుకు వస్తాడన్న నమ్మకం ఆయనపై ఉంది. దీంతోనే కుప్పాయి గోపాలరావుకు జనసేన పార్టీ తరుపున మందస జడ్పీటీసీ పదవికి కూటమి తరుపున పోటీకి కూటమి పెద్దలు పరిశీలన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆయన జడ్పీటీసీ గా పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. జనసేన పార్టీకి నేటి వరుకు కీలక పదవి లభించలేదు. దీంతో జడ్పీటీసీ పదవికి కుప్పాయి గోపాలరావు పేరు వినిపిస్తుండగా.. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనపై మంచి నమ్మకంతో ఉన్నట్టు తెలియవచ్చింది. సౌమ్యునిగా, మంచి నాయకునిగా, అందరిని కలుపుకొనే వ్యక్తిగా.. ముఖ్యంగా పార్టీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమించే నాయకునిగా కుప్పాయి గోపాలరావుకు మంచి గుర్తింపు ఉంది. మందస జడ్పీటీసీ స్థానానికి కూటమి తరపున పోటీ చేసేందుకు జనసేన పార్టీ నాయకుడు కుప్పాయి గోపాలరావు ఆశావహునిగా ఉన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాజకీయాలపై ఆసక్తితో ప్రజారాజ్యం పార్టీ కాలం నుంచే రాజకీయ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూ వచ్చిన గోపాలరావు జనసేన పార్టీ స్థాపన అనంతరం క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతున్నారు. మొదటిసారిగా 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో డిమిరియా గ్రామస్తుడిగా జిల్లుండా ఎంపీటీసీ స్థానం నుండి పోటీ చేసి రాజకీయంగా తన ప్రస్థానాన్ని మరింత బలోపేతం చేసుకున్నారు. బీటెక్ సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన గోపాలరావు సివిల్ వర్క్స్ కాంట్రాక్టర్ గా ప్రస్తుతం పని చేస్తున్నారు. మందస మండలంలోని ప్రజలతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. జనసేన పార్టీ తరఫున నియోజకవర్గంలో మొట్ట మొదటి బాధ్యతను చేపట్టి, నియోజకవర్గంలో ఏకైక మండల అధ్యక్షుడిగా గుర్తింపు పొందారు. తన సొంత స్థలంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి పార్టీ బలోపేతంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన తనదైన శైలిలో కృషి చేస్తున్నారు. కూటమి రాజకీయాల్లోనూ అందరితో సత్సంబంధాలు కొనసాగిస్తూ, జనసేన పార్టీ నాయకులతో పాటు కూటమి పార్టీలకు చెందిన ముఖ్య నాయకుల మన్ననలు పొందుతున్న నాయకుడిగా గోపాలరావుకు గుర్తింపు ఉంది. కుప్పాయి గోపాలరావు తూర్పుకాపు సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం కూడా ఆయనకు కలిసివచ్చే అంశంగా భావిస్తున్నారు. కరోనా కష్టకాలంలోనే కాకుండా ఇతర సందర్భాల్లోనూ నిరుపేదలకు జనసేన పార్టీ తరఫున పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి, తన వంతు సహాయాన్ని అందించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో స్థానిక కూటమి ఎమ్మెల్యే గౌతు శిరీషా, ఎంపీ కింజరాపు రామ్మోహన్నాయుడు ఘన విజయానికి తనదైన పాత్ర పోషించారనే చెప్పాలి. జడ్పీటీసీ స్థానానికి రిజర్వేషన్ అనుకూలించి, కూటమి పార్టీల ముఖ్య నాయకుల ఆశీర్వాదం లభిస్తే కూటమి తరపున జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు కుప్పాయి గోపాలరావు సిద్ధంగా ఉన్నారని తెలుస్తోంది. జనసేన పార్టీలో మండల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులతో కూడా గోపాలరావు సన్నిహిత సంబంధాలున్నాయి. కుప్పాయి గోపాలరావు జడ్పీటీసీగా పోటీ చేయడానికి సామాజిక అంశం అనుకూలిస్తుండగా.. ఆయన పార్టీ కూడా వెనుదన్నుగా నిలవడానికి సిద్ధంగా ఉందని చెబుతున్నారు. మందస మండలంలోని జిల్లుండ పంచాయతీలోని డిమిరియా గ్రామానికి చెందిన ఆయన విద్యావేత్తగా, సమాజసేవకునిగా గుర్తింపు పొందారు. డిమిరియా గ్రామం మంచి రాజకీయ నాయకులకు నిలయంగా వస్తోంది. ఇదే అంశం గోపాలరావు కలసి రావచ్చని పార్టీ శ్రేణులు చెప్పుకుంటున్నాయి. రాజకీయ, సామాజిక, వ్యక్తిగత అంశాలు



కూడా ఆయనకు తోడవుతున్నాయి. కూటమి నాయకులు కూడా గోపాలరావు అభ్యర్థిత్వంపై సానుకూలంగానే ఉన్నట్టు తెలుస్తోంది. మందస మండలంలో ఎంపీపీ పదవి తెలుగుదేశం పార్టీకి కేటాయించే అవకాశం వున్నప్పుడు, జడ్పీటీసీ జనసేనకు కేటాయించే అవకాశం లేకపోలేదు అని అది అతనికి సానుకూలం అవుతుంది అని ఆయా పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారు. ఈ తరుణంలో కుప్పాయి గోపాలరావు పేరు జడ్పీటీసీగా తెరపైకి రావడంతో జనసేన నాయకులు, కార్యకర్తలు, కుప్పాయి గోపాలరావు అభిమానులకు ఆనందమైన వార్తగా ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా అదృష్టం, కూటమి నాయుకుల ఆశీర్వాదం ముఖ్యం అని. కాలమనేది చాలా గొప్పదని, భవిష్యత్ లో ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందేనని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

## పురుషోత్తపురంలో అదనపు బూత్ ఏర్పాటు చేయండి



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 11 (వార్త):** పురుషోత్తపురంలో చిన్నవీధి దక్షిణ భాగం 3 వ వార్డ్ లో కలిపడం వల్ల సుమారు 450 మంది ఓటర్లు ఊర్లో ఉన్నారని అన్నారు.వీరంత 1 కిలోమీటరు దూరంలో ఉన్న అమీన్ సాహెబ్ పేట లో ఉన్న ఎన్నికల బూత్ కి వెళ్లి ఓట్ వెయ్యడానికి ఇబ్బంది పడతారని కావున పురుషోత్తపురం ఊర్లో ఎన్నికల బూత్ ఏర్పాటు చెయ్యవల్సిందిగా 1 వ వార్డు మాజీ కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్ కుమార్ కమీషనర్ రమేష్ ను కోరారు.

## మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 11 (వార్త):**మట్టి వినాయకుడిని పూజిస్తాం.. పర్యావరణాన్ని కాపాడుకుందాం అని ఈదుపురం జిల్లా పరిషత్ కంద్ర వార్డు ఉన్నత పాఠశాల హెచ్ ఎం ఎం.. బి.ఉమామహేశ్వరి విద్యార్థులతో అన్నారు. నేసషనల్ గ్రీన్ కాప్స్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలను తయారు చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర పాడి, సబితా కుమారి దేవి ఉపాధ్యాయ సిబ్బంది, ఆనందరావు, పాడి, గీతాంజలి మహారాణ తదితరులు పాల్గొన్నారు. అలాగే పురుషోత్తపురం ఉన్నత పాఠశాలలో మట్టి వినాయకుడితో ముందస్తు సంబరాలు నిర్వహించారు ఎ ఇన్చార్జి హెచ్ఎం పద్మవల్లి, రవీంద్రబాబు, అరుణ్ కుమార్ ఈశ్వరి, శంకర్,భాస్కర్, జోగారావు, విసు, గణపతి పాల్గొన్నారు.

## మహాలక్ష్మి దేవికి పూజలు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 11 (వార్త):** జగన్నాథ స్వామి ఆలయంలో కొలువై ఉన్న మహాలక్ష్మి దేవికి శ్రావణ మాస ఆఖరి శుక్రవారం, అమావాస్య పర్వదినం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉషోదయాన నిత్యారాధన అనంతరం లక్ష్మి దేవి మూల విరాట్ కు పాలు, పంచామృతాలు, గంగా జలం, ఫల రసాలతో అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్ర అలంకరణ జరిగింది పంచవర్ణ పుష్పాలు , పసుపు, కుంకుమల తో సహస్రనామ అర్చన ను అర్చకులు పద్మకుమార్ ఆచార్యులు జరిపారు. ఈ సందర్భంగా మహిళలు 9 పర్యాయాలు మణిద్వీప వర్ణన పారాయణ చేశారు. అలానే విష్ణు, లక్ష్మీ, లలితా సహస్రనామ స్తోత్ర పారాయణ చేశారు. హారతి, మంత్ర పుష్పం, ప్రసాద వితరణ జరిగాయి.

## సేవా కార్యక్రమాలతో దాసరి జన్మదిన వేడుకలు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 11 (వార్త):** రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు జన్మదిన వేడుకలు జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, కార్య కర్తలు, అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జనసేన పార్టీ కార్యాలయం వద్ద జెమ్స్ హాస్పిటల్ సౌజన్యంతో భారీ రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని దాసరి రాజు గారు ప్రారంభించగా, సుమారు 40 మంది జనసైనికులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. తదుపరి కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు.

## హెచ్ఐవీపై అవగాహన

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 11 (వార్త):** స్థానిక ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో హెచ్ఐవీ క్యాంపెయిన్ నిర్వహించారు. డా.దేవేంద్ర రెడ్డి, డా.నీలిమ, డా. ప్రేమ్ కుమార్ సుఖ వ్యాధులపై అవగాహన కల్పించారు. దిశా హెల్త్ ఎడ్యుకేటర్ రవికుమార్, కౌన్సిలర్ రాజశేఖర్, గున్న రవి, హెడ్ సిస్టర్ భవాని, మోహన్, రాజు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.




# సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్



**నరసన్నపేట, సెప్టెంబరు 11 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపే ఉద్దేశంతో కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన పాల్గొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి నేరుగా వినతులు, అర్జీలను స్వీకరించారు. ప్రజలు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలతో పాటు వ్యక్తిగత అవసరాలకు సంబంధించిన పలు అంశాలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యమంత్రి సహాయనిధి, పింఛన్లు, రేషన్ కార్డులు, తాగునీటి సౌకర్యం, భూ సమస్యలు, రహదారుల పునర్నిర్మాణం, విద్యుత్ సరఫరా తదితర సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. ఆయా సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే, బగ్గు అర్చన సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికే కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఏ ఒక్క అర్హుడూ సంక్షేమ ఫలాలకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజాదర్బార్‌లో స్వీకరించిన ప్రతి వినతిపత్రాన్ని సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటిపై తక్షణమే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడకుండా, సాధ్యమైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. ప్రజాదర్బార్‌లో తమ సమస్యలను నేరుగా నాయకుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభించడంతో పలువురు ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.

# కొత్త పింఛన్లు దరఖాస్తు గడువు పెంచండి



**ఇచ్ఛాపురం సెప్టెంబరు 11(వార్త):** వైస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి మండలం, లొద్దపుట్టి పంచాయతీ సచివాలయం సందర్శించి కొత్త పెన్షన్ నమోదు ప్రక్రియలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు స్వయంగా తెలుసుకునే ప్రయత్నం చేశారు. పెన్షన్ కొరకు అప్లై చేయడానికి సచివాలయం వద్దకు వచ్చే వారికి మొదట ఇబ్బంది అవసరమైన డాకుమెంట్స్ పై అవగాహనా లేకుండా వచ్చి నిలబడి తీరా తమ వంతు వచ్చేసరికి సర్వర్ పనిచేయకపోవటం, కొంతమందికి హౌస్ హోల్డ్ మాపింగ్ జరగలేదని, రేషన్ కార్డ్ స్ప్లిట్ అవ్వలేదని, దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ ఉన్నప్పటికి నెంబర్ సిస్టమ్ లో రిఫ్లెక్ట్ అవ్వక పోవటం ఇలా అనేక అవంతరాలు దాటి నమోదు చేసుకోవలసిన పరిస్థితి ఎదురైవుతుందని గుర్తించారు. ఈ నెల 16 వరకూ గడువు విధించిన ప్రభుత్వం 12,13,14 తేది లలో సెలవులు వలన ఆఖరి రెండు రోజులలో ఖచ్చితంగా సర్వర్ క్రాష్ అయ్యే పరిస్థితి ఏర్పడుతుందని, అనేక సమస్యలకు తోడు అధికార పార్టీ నాయకుల ప్రమేయం తగ్గించి అర్హత గల ప్రతీ ఒక్కరికి అప్లై చేసుకోవడానికి అవకాశం కల్పించాలని గడువు తేదిని ఈ నెలాఖరు వరకూ పొడిగించాలని కోరారు.

కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్రయాదవ్, పిట్ట ఆనంద్ పాల్గొన్నారు.

# ఉత్సాహంగా జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే

**సోంపేట, సెప్టెంబరు 11(వార్త):** సోంపేట ప్రభుత్వ జూని యర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగాయి. ప్రిన్సిపాల్ ఏ.మోహన్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా స్థానిక ఎస్సై మోహిని, కళాశాల అభివృద్ధి దాత బరాటం రమేష్, పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు కాళీ బెహరా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మోహిని మాట్లాడుతూ విద్యార్థులు బాధ్యతగా, పట్టుదలగా, మంచి క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయాలని కోరారు. ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిలో చాలా కీలకమైన సబ్జెక్టులను ఎంతో శ్రద్ధగా చదవాలని మంచి ప్రతిభ సాధించాలని సూచించారు. అన్నిటికన్నా మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధన కోసం నిరంతరం అంకితభావంతో కృషి చేయాలని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. జి.వెంకట్రావు, పి.రజిని కుమారి, సుజాత నాయక్, రామినాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.



## విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పధానికి చెకుముకి



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 11 (వార్త):** జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రెండవ దశ మండల స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు విజయవంతంగా జరిగినట్లు మండల అధ్యక్ష కార్యదర్శులు జి.కామరాజు, జి.రమేష్‌బాబు తెలిపారు. శుక్రవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాలలో చెకుముకి సైన్స్ మండల స్థాయి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇచ్ఛాపురం మండల విద్యాశాఖాధికారులు కె సూర్యారావు, ఎస్ విశ్వనాథం, ఇన్ చార్జి ప్రధానోపాధ్యాయులు ఎ జయలక్ష్మి లు మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకతను పెంచేందుకు శాస్త్రీయ దృక్పథాన్ని నెలకొల్పేందుకు ప్రశ్నించే తత్వాన్ని ప్రోత్సహించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు దోహదపడతాయని తెలిపారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు సైన్స్ ఉద్యమ అభిమానులు పాల్గొన్నారు.

### మండల స్థాయి విజేతలు:

మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ,ఇచ్ఛాపురం ప్రథమ స్థానం, పొందగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ఈదుపురం విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని పొందారు. వీరికి మండల విద్యా శాఖాధికారులు,జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శులు చెకుముకి సైన్సు సంబరాలలో గెలుపొందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మెమెంటోలను అందజేశారు. ఈ రెండు పాఠశాలల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## టి.బరంపురం మురుగు సమస్య పరిష్కరించాలి



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 11 (వార్త):** టి.బరంపురం గ్రామంలో దళిత వీదిలో గల మురుగు నీరు కాలువ ప్రవాహానికి అడ్డుగా మట్టి మేట వేయడం వలన మురుగు నీరు నిలువ వలన ఆ గ్రామ వాసులు తీవ్ర ఆసౌకర్యానికి గురవుతున్నారని , సమీపంలో గల రోడ్డుపై కల్వర్ట్ నిర్మాణం వలన మట్టి పేరుకొని మార్గం మూసుకొని పోవటం వలన ఈ పరిస్థితి ఏర్పడిందని మురుగు నీరు నిల్వకు తోడు వర్షం వలన ఈ ప్రాంతంలో విపరీతంగా దోమలు మరియు బురద ఏర్పడిందని నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయ కర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి చెప్పారు., ఈ పరిస్థితి నుండి పరిష్కారం కొరకు స్థానిక శాసన సభ్యునికి గతంలో తెలియజేయగ నేటి వరకూ ఎటువంటి పరిష్కారం దొరకక పోవడం వలన కాలనీ వాసులు జిల్లా కలెక్టర్ కి లెటర్ ద్వారా తమ సమస్య పరిష్కారం కొరకు తన అందజేయమని కోరారని , త్వరలో కలెక్టర్ దృష్టిలోకి సమస్య తీసుకొని వెళ్లి పరిష్కారం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ కారింగి త్రినాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పెట్రోల్ బంక్ సిబ్బంది నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

**సోంపేట, సెప్టెంబరు 11 (వార్త):** సోంపేట శ్రీ విజయ దుర్గ ఆలయం ఎదురుగా కొత్తగా ఏర్పాటైన హెచ్‌పీసీఎల్ ప్రభుత్వ పెట్రోల్ బంక్‌లో ఇద్దరు మేనేజర్లు, ఆరుగురు పంప్ ఆపరేటర్ల పోస్టులకు పలాస ఆర్డీఓ రాచర్ల అప్పలరాజు శుక్రవారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదల చేశారు. మేనేజర్ పోస్టనకు డిగ్రీ విద్యార్హత కలిగి కనీసం 15 ఏళ్ల అనుభవం ఉండాలని, పంపు ఆపరేటర్ పోస్టుకు పదో తరగతి అర్హత పొంది కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలని సూచించారు. కనీసం 20 ఏళ్ల నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఈ మేరకు స్థానిక తహసిల్దార్ అప్పలస్వామి వివరాలను విలేకరులకు వెల్లడించారు. పూర్తి వివరాలకు తహసిల్దార్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 18 లోగా పలాస ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546